722) వరాళి

ప|| ఏటికి సత్యాలు సేసేవెందాకా నీవు |గాటముగ నింకా దారుకాణించవలెనా ||

చ|| చెలియిచ్చిన పువ్వుల చెండు నీచేతనున్నది | మలసి నీచేతకది మచ్చముగాదా |
కొలది మీరగ తొల్లె గొల్లెతల మగడవు | యెలమి నీ యెడ్డతనా లెంచి చూపవలెనా ||

చ|| రమణి చేముద్దుటుంగరము నీవేలనున్నది | కొమరై నీపొందు కది గురుతుకాదా |
తమితోడ నీవు తొల్లి ధర్మరాజు మఱిదివి | గములై నీ నిజాలకు కడగురుతున్నదా ||

చ|| అంగనకంటసరి నేడట్టె మెడనున్నది | సంగతిగా నీకదే లాంఛనము గాదా |
చెంగట నన్నేలితివి శ్రీవేంకటేశ్వర | అంగపు నీరీతులకు నౌగాములున్నవా ||